## బతుకమ్మ వేడుకలు



గచ్చిబౌలిలోని టీఎన్‌జీఓ కాలనీలో బతుకమ్మ వేడుకల్లో మహిళలు

## ఘనంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

శేరిలింగంపల్లి, అక్టోబర్ 15: గచ్చిబౌలి, శేరిలింగంపల్లి ప్రాంతాల్లో దసరా దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం మొదటిరోజు కావడంతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ దేవాలయాల్లో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వివిధ రూపాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చన పూజల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మొదటిరోజు శ్రీ శోదసి రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.



లింగంపల్లి ఆరంభ టౌన్‌షిప్‌లో దుర్గాదేవి మండపంలో కొలువుదీరిన అమ్మవారికి పూజలు చేస్తున్న స్థానికులు

## అబ్దుల్ కలాంకు ఘన నివాళి



భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త దివంగత ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఆదివారం చందానగర్‌లో ఆల్ ఇండియా న్యూస్ పేపర్స్ వెండర్స్ డేను తెలంగాణ ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొని అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్, శేరిలింగంపల్లి ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్స్ పాల్గొన్నారు.

– కొండాపూర్, అక్టోబర్ 15




# అన్ని వర్గాలకు సమన్యాయం..

### బీఆర్ఎస్ మ్యానిఫెస్టో పై ప్రజల హర్షం

### పేదలకు సన్నబియ్యం



రేషన్ దుకాణాల్లో తెల్లరేషన్ కార్డులు కలిగి ఉన్న పేదలకు సన్నబియ్యం అందిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉంది. బీఆర్ఎస్ మేనిఫెస్టోలో అన్నపూర్ణ కింద ప్రతి పేద కుటుంభానికి రేషన్‌షాపుల ద్వారా సన్నబియ్యాన్ని సరఫరా చేస్తామని పేర్కొన్నారు. మళ్లీ అధికారంలోకి రాగానే వెంటనే ఈ అన్నపూర్ణ రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని చెప్పారు. ఎంతో కాలంగా పేదలు ఎదరుచూస్తున్న గొప్ప పథకం ఇది. దీనిపై దృష్టిసారించి తెల్లరేషన్ కార్డుదారులందరికీ సన్నబియ్యం అందించేందుకు చర్యలు చేపడుతామని చెప్పడం సంతోషంగా ఉంది. పేదలకు మూడు పూటల కడుపునింపేందుకు దోహదపడే ఎంతో గొప్ప పథకం పేదింట్ల సన్నబియ్యం.

– బచ్చన్నగారి రాజు,కొత్తగూడ

### ఆరోగ్యశ్రీ గరిష్ట పరిమితిపెంపు పేదలకు భరోసా



ఇప్పటికే ఆరోగ్యశ్రీ ద్వారా పేద కుటుంబాలకు రూ. 5 లక్షలు అందిస్తున్న తెలంగాణ ప్రభుత్వం దాని గరిష్ట పరిమితి 15 లక్షలకు పెంచడం పేదల ఆరోగ్యానికి భరోసా. అత్యధిక శాతం ప్రజలకు మునుపటి కంటే అధికంగా పేదప్రజలకు మెరుగైన ఆరోగ్య వైద్యసేవలు అందించేందుకు ముందుకు రావడం శుభపరిణామం. వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి సామాన్యులకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలను అందిస్తూ అందరి మన్ననలు పొందడమే కాకుండా మళ్లీ అధికారంలోకి రాగానే గరిష్ట పరిమితి రూ.15 లక్షలకు పెంచడం లాంటి చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకోవడం వాటిని ఆచరణలో పెట్టడం సీఎం కేసీఆర్‌కే సాధ్యం.

– బంగారి ఆంజనేయులు, శిల్పాగార్డెన్స్


### ఆరోగ్య బీమాతో పేదల బతుకుల్లో ధీమా..



పేద, మధ్య తరగతి ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించేందుకు కేసీఆర్ మరో అడుగు ముందుకేసి రూ. 15లక్షల ఆరోగ్య బీమాను ప్రకటించడం హర్షణీయం. ఆరోగ్యశ్రీ బీమాను మూడింతలు పెంచుతూ పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యానికి ధీమా కల్పించారు. మారుతున్న కాలంలో పెరుగుతున్న అనారోగ్య సమస్యలతో పేదలు సతమతమతువున్నారని, వారి బతుకుల్లో వెలుగులు నింపేలా కేసీఆర్ ఆరోగ్య బీమా భరోసానిస్తుంది. భవిష్యత్తులోను మరింత మెరుగవ్వాలంటే మళ్లీ ముఖ్యమంత్రి కేసీఆర్ సారే అవ్వాలి.

– వరలక్ష్మి, చందానగర్


### మహిళ అభ్యున్నతికి పెద్ద పీట ..



రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేస్తు అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో పేద ప్రజలకు కావలసిన వసతులు, అవసరాలను అన్ని తానై పథకాల రూపంలో పేద కుటంబాలకు, మహిళలకు అండగా నిలుస్తున్నారు. పేదలకు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు చేయూతనిచ్చేందుకు ప్రతి నెలా పెన్షన్‌ను ఇస్తుండు. గత ప్రభుత్వాలు పేరుకు పెన్షన్‌లను ఇస్తున్నట్లు రూ.70 నుంచి రూ. 200 ల వరకు ఇచ్చేవారు. వారు ఇచ్చే పెన్షన్‌తో కూటికి, గూడుకు వచ్చేవి కాదు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా వచ్చాక రూ. 200 లు ఉన్న పెన్షన్‌ను వేలల్లో పెంచిండు. ఇంటికి పెద్ద కొడుకులా అన్ని తానై చూసుకుంటుండు. మళ్లీ ముఖ్యమంత్రిగా కేసీఆర్‌నే అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటాం.

– మల్లీశ్వరి, కొండాపూర్

### పేదలకు పైసా ఖర్చు లేకుండా సొంతిల్లు..



నగరంలో స్థలాలు, ఇండ్ల ధరలు లక్షలలో పలుకుతున్న ప్రస్తుత పరిస్థితులలో పేదలకు సొంతిల్లు చాలా కష్టం. కానీ సీఎం కేసీఆర్ సార్ మాత్రం నయా పైసా ఖర్చు లేకుండా లక్షల విలువైన డబుల్ బెడ్ రూం ఇంటిని ఇస్తుండటం సంతోషకరం. నాలాంటి పేదలను దృష్టిలో పెట్టుకుని మరో లక్ష డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మిస్తామని సీఎం కేసీఆర్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టడంతో మాక్కూడా తప్పకుండా ఇల్లు దక్కుతుందన్న ఆశాభావం మరింత పెరిగింది. పేదరికమే అర్హతగా నయా పైసా ఖర్చు లేకుండా డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇస్తున్న ఈ సర్కారుకు పేదల మద్దతు ఉంటుంది. పేదల అవసరాలను తెలుసుకుని ఎన్నికల హామీలను రూపొందించి సీఎం కేసీఆర్ సార్‌పై వాటిని అమలు చేస్తారన్న సంపూర్ణ నమ్మకం ఉన్నది.

– శివరాత్రి రజిత, గృహిణి

## ఘనంగా విప్ గాంధీ పుట్టిన రోజు వేడుకలు



విప్ గాంధీకి శుభాకాంక్షలు తెలుపుతున్న మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్



విప్ గాంధీతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఆల్విన్ కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్

మియాపూర్, అక్టోబర్ 15 : విప్ అరెకపూడి గాంధీ పుట్టిన రోజు వేడుకలు ఆదివారం ఆయన నివాసంలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు బాణా సంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. గజమాలతో ఘనంగా సత్కరించారు. నియోజకవర్గంలోని ఆయా డివిజన్‌ల కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు విప్ గాంధీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఉదయం వేద పండితులు విప్ గాంధీకి వేద ఆశీర్వచనం అందించారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులతో పాటు డివిజన్ పార్టీ అధ్యక్షులు, సేవా, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కాలనీ అసోసియేషన్ల ప్రతినిధులు, మహిళలు పెద్ద ఎత్తున విప్ నివాసానికి చేరుకుని శాలువాలు, పూలదండలతో సత్కరించి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.



విప్ గాంధీకి కేక్ తినిపిస్తున్న చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి



విప్ గాంధికి శుభాకాంక్షలు తెలుపుతున్న వివేకానందనగర్ కార్పొరేటర్ రోజాదేవిరంగారావు



విప్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా

## ఆర్థిక సాయం

కొండాపూర్, అక్టోబర్ 15 : బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న చిన్నారి హన్విత (6)కు వైద్య ఖర్చులకు హైటెక్‌సిటీలోని మైహోం నవద్వీప ఫౌండేషన్ రూ. 27,300ల చెక్‌ను పాప కుటుంబ సభ్యులకు అందజేసినట్లు తెలిపారు. ఫౌండేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు.

## శతాధిక వృద్ధురాలు మృతి

మాదాపూర్, అక్టోబర్ 15: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో శతాధిక వృద్ధురాలు వెంకటరామమ్మ (100) ఆదివారం అనారోగ్యం కారణంగా మృతి చెందారు. కమ్యూనిస్ట్ ఉద్యమానికి కోటగా పేరొందిన ప్రాంతాల్లో ఒకటైన గన్నవరం తాలూకా పెద్ద అవుటుపల్లి గ్రామంలో యార్గగడ్డ కోటయ్య, నానమ్మ దంపతులకు వెంటకరామమ్మ జన్మించింది. నాలుగు తరాల వారిని చూసిన ఆమె ఈ నెల 10 వ తేదీన సీఆర్ ఫౌండేషన్‌లోని వృద్ధులతో కలిసి 100వ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకుంది. ఈ నేపథ్యంలో సీఆర్ ఫౌండేషన్ సభ్యులు, ప్రముఖులు ఆమె భౌతిక కాయానికి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం ఆమె కళ్లు ఎల్‌వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్‌కు సమర్పించారు. పార్థివ దేహన్ని మెడికల్ కళాశాలకు అప్పగిస్తున్నట్లు సీఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవులు తెలిపారు.

## బతుకమ్మ సంబురం



బతుకమ్మ సంబరాలను పురస్కరించుకుని ఆదివారం దీప్తి మామిడి ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాలలో పలువురు టాలీవుడ్ నటులు, పేజ్3 సోషల్ స్టేటస్ తారలు పాల్గొని సందడి చేశారు. దీప్తి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తామని, ఉత్సవాలలో కుటుంబ సమేతంగా పాల్గొని బతుకమ్మ ఆటపాటలతో సందడి చేస్తారని తెలిపారు.

– మాదాపూర్, అక్టోబర్ 15